www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 డిసెంబర్ 2024
5
కాకినాడ



వరి నాట్లు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

రబీలో నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎ.అశోక్ కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నాట్ల దశను పరిశీలించారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ రబీలో త్వరితగతిన నాట్లుపూర్తి చేసినట్లయితే మూడో పంటగా అంతర పంటలు వేసుకున్నట్లయితే రైతులకు అదనపు ఆదాయంతో పాటు వేసుకు పోషకాలు సమృద్ధిగా అందుతాయన్నారు. వారం రోజులుగా ముమ్మరంగా దమ్ములు జరుగుతున్నాయని, మరో వారం రోజుల్లో 50 శాతం నాట్లు వెదజల్లే పద్ధతిలో వేస్తారని తెలిపారు. రబీలో 95 శాతం వెదజల్లే పద్ధతిలో నాట్లు వేస్తారని ఆయన తెలిపారు.

సమాజ నిర్మాణంలో సాహిత్యం కీలకం

- మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు
- ఉత్సాహంగా సాగిన కవితాగోష్టి, ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సమాజం నిర్మాణంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభ సందర్భంగా శుక్రవారం పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో కవితా గోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రతిధ్వని' పేరుతో రచించిన కవితా సంకలనం పుస్తకాన్ని కవులు, ప్రముఖులు ఆవిష్కరించారు.

సాహితీ స్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సభలో సూరిబాబురాజు మాట్లాడారు. సమాజం బాగు కోసం ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా కళలు, కవిత ద్వారా చెప్పిందే ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ఇటువంటి కవితాగోష్టి కార్యక్రమాల వల్ల ప్రజలు చైతన్యవంతం అవుతారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి అనేకమంది ఉద్యమించారన్నారు. ఇందులో సాహిత్యం కూడా కీలక భూమిక పోషించిందన్నారు. 'ప్రతిధ్వని' పుస్తకంలో కవితలు రచించిన కవులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. సాహితీ స్రవంతి భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా మహాసభ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.



కవితాగోష్టిలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రాజా సూరిబాబురాజు, గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

కృష్ణబాబు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి వందేళ్ళ పైబడిన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిజం అనేది సోషలిజం యొక్క అత్యుత్తమ దశ అన్నారు. పీడితవర్గాల పక్షాన పోరాడటమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, సోమసుందర్, అద్దేపల్లి వంటి కవులు కార్మికుల, కర్షకుల, కష్టజీవుల పక్షాన నిలబడి కవిత్వం చెప్పారన్నారు. పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడి రాయాలనే ఆలోచనను శ్రీశ్రీ కవిత్వం రేకెత్తించిదన్నారు. ప్రతిధ్వని పేర కవితా సంపుటిని తీసుకురావడం గొప్పవిషయమన్నారు. ఇందులో మొత్తం 62 కవితలు వున్నాయన్నారు. సాహితీ స్రవంతి పెద్దాపురం పట్టణ కార్యదర్శి కె.శివ పుస్తక సమీక్ష నిర్వహించారు. పట్టణ గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ కవులు, కళాకారులు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. సామాజిక చైతన్యానికి కవితే స్ఫూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పిటి రవికుమార్, సలాది సాయి సత్యనారాయణ, పూడి శ్రీనివాసరావు, తిరగటి విజయరత్నం, డాక్టర్ కాపుగంటి కోటి, తలుపులు, చర్ల వెంకట సీతారామారావు, సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, యుటిఎఫ్ నాయకులు బి.అనంతరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు డి.సత్యనారాయణ, డి.కృష్ణ, రొంగల వీర్రాజు, ఎం.రాంబాబు తదితరులు గేయాలను ఆలపించారు.

సుందరయ్య బాటలో నడవాలి

సిపిఎం సీనియర్ నాయకులు ప్రకాష్

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కార్యకర్తలు ప్రజా ఉద్యమాల ద్వారా ముందుకు సాగాలని సిపిఎం సీనియర్ నాయకులు బివిఎస్.ప్రకాష్ అన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభ సందర్భంగా స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఏర్పాటుచేసిన సుందరయ్య జీవిత, ఉద్యమ ఫోటోల ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుందరయ్య ప్రజా ఉద్యమాలే ఊపిరిగా చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. నిత్యం ప్రజల కోసమే తపిస్తూ సమసమాజ స్థాపన పోరాటాల బాటలో ఆయన ముందుకు సాగారన్నారు. సుందరయ్య ఆశయ సాధన కోసం కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబిరాణి మాట్లాడుతూ సుందరయ్య కమ్యూనిస్టులకే కాకుండా ప్రజాప్రతినిధులు అందరికీ ఆదర్శంగా తన జీవితాన్ని గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు, కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య, నెక్కల నరసింహమూర్తి, కూనిరెడ్డి నరసింహమూర్తి, రొంగల సుబ్బలక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు, డి.సత్యనారాయణ, ఎం.రాంబాబు, డి.కృష్ణ ఉద్యమ గీతాలు ఆలపించారు.



ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు ప్రకాష్

నేడు బహిరంగ సభ

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పెద్దాపురం ఆంజనేయ స్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడతారు. అంతకంటే ముందు మున్సిపల్ సెంటర్ నుంచి నాగేశ్వరరావు వీధి, మరిడమ్మ గుడి సెంటర్, పాత బస్టాండ్, దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ సెంటర్ల మీదుగా ప్రదర్శన జరగనుంది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం భవనంలో సీతారాం ఏచూరి నగర్‌లో ప్రతినిధుల సభ జరగనుంది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు హాజరుకానున్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ఇంధన వనరులను పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఇంధన వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంధన పొదుపు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాలను కాకినాడ జిల్లాలో ఏడు రోజులుగా నిర్వహించినట్టు తెలిపారు. ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్టు కలెక్టర్ తెలిపారు. ఇంధన వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గృహోపకరణాల్లో విద్యుత్తు ఉపకరణాలను స్టార్ రేటింగ్ ఉన్నవి మాత్రమే వినియోగించాలని సూచించారు. ఇప్పటికే గృహాల్లో ఉన్న ఎసి, రిఫ్రిజిరేటర్లు ఇతర విద్యుత్ పరికరాలు తక్కువ కరెంటు వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్య ఘర్ పథకం కింద రాయితీపై సోలార్ ప్యానల్ అందిస్తోందన్నారన్నారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ.70 వేలు ఖర్చు అవుతుందని, దీనిలో రూ.30 వేల ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ జి.ప్రసాద్, ఇఇలు ఎన్.ఉదయ్ భాస్కర్, ఎ.ప్రభాకర్, వీరభద్రరావు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుజాత

ప్రజాశక్తి-పిఠాపురం

వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా వర్ధినీడి సుజాతకు రెండోసారి అవకాశం దక్కింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తనను కాకినాడ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలుగా నియమించారని ఆమె ఒక ప్రకటలో తెలిపారు. తాను గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా, పిఠాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పని చేశానన్నారు. వెనుకబడిన వర్గాల మహిళలను ప్రోత్సహిస్తున్న పార్టీ, కష్ట పడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తున్న పార్టీ వైసిపి అన్నారు. తనకు మళ్ళీ అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్.జగన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబుకు, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీతకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మార్కెట్ ధరల రివిజన్‌పై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-కాకినాడ

మార్కెట్ ధరలు విలువల పెంపుపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రిజిస్ట్రేషన్, స్టాంపులు, రెవెన్యూ, జిల్లా పరిషత్, సబ్ రిజిస్ట్రార్లు మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ ధరలు విలువలు రివిజన్-2024 అంశంపై మార్కెట్ విలువలు పెంపుదల కోసం తయారు చేసిన ప్రతిపాదనలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ప్రతిపాదనలను ప్రజల నిమిత్తం ఈ నెల 20 నుంచి రిజిస్టర్ ఆఫీసు నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై ఈ నెల 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. రివిజన్ చేసిన మార్కెట్ ధరలకు ఈ నెల 27న తుది ఆమోదం తెలుపుతామని చెప్పారు. ఆమోదం పొందిన తుది మార్కెట్ ధరల విలువలను జనవరి 1, 2025 నుంచి అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు, శివరాం, జెయుఎన్.జయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

మున్సిపల్ పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ జిల్లా పరిధిలోని మున్సిపల్ పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహారావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కాకినాడ జిల్లా పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు, సెక్షన్ హెడ్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మున్సిపల్ పరిధిలోని అన్ని విభాగాలకూ సంబంధించిన అంశాలపై ఆయన సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో పెద్దాపురం నూరు శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో ఉందన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ పన్నుల వసూళ్ల మరింత మెరుగు పరుచుకోవాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, సామర్లకోట కమిషనర్ శ్రీవిద్య, తుని కమిషనర్ వెంకటరావు, పిఠాపురం కమిషనర్ కనకారావు, ఏలేశ్వరం కమిషనర్ సత్యనారాయణ, గొల్లప్రోలు కమిషనర్ టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డి నాగ నరసింహారావు

పిఠాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో వివిధ రికార్డులను పరిశీలించారు. కేసులు పురోగతి, దర్యాప్తు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. రూరల్ పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందన్నారు. మండల పరిధిలో అత్యధికంగా ఆత్మహత్య కేసులు నమోదవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా నేరాలు అదుపులో ఉన్నాయని తెలిపారు. రికవరీలు మాత్రం 40 శాతం చేయవలసి ఉందని తెలిపారు. ప్రతి సబ్ డివిజన్ కార్యాలయానికి ఒక క్రైమ్ సీఐని నియమించినట్లు తద్వారా పాత నేరస్తులను తీసుకువచ్చి జరిగిన నేరాలపై రికవరీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిఎస్‌పి రఘువీర్ విష్ణు, పిఠాపురం సిఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి-శంఖవరం

రోడ్డు ప్రమాదాల నివారణకు నియమాలు పాటించడమే ఉత్తమమని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా కత్తిపూడిలో సీతారామ కళాశాల వద్ద విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల బారిన పడిన వారిని సపర్యల నిమిత్తం సమీప ఆసుపత్రికి ఎవరైనా వ్యక్తులు తీసుకెళ్తే వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5000 బహుమతి ఇస్తుందన్నారు. అనంతరం వైద్యురాలు పద్మ, ఎంవిఐ అవినాష్ మాట్లాడారు. వేగంగా డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ డ్రైవింగ్ తప్పని, ప్రమాదం గురైన వ్యక్తికి సిపిఆర్ చేసి బాధితునికి సాయపడాలని చెప్పారు. ఈ సమావేశంలో కాకినాడ ఎంవిఐ సాయిబాబా, ప్రిన్సిపల్ వీరబాబు, ఎన్ఎస్-ఎస్ కో ఆర్డినేటర్ అక్కారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్త కొండబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-జగ్గంపేట

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా జగ్గంపేటకు చెందిన కొత్త కొండబాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో కొండబాబును స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఇమ్మిడిసెట్టి నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులను గుర్తించి రాష్ట్ర కార్పొరేషన్‌లో కాకినాడ జిల్లా నుంచి కొండబాబును డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కొండబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులను గుర్తించిన ప్రభుత్వ పెద్దలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడ సతీష్, ములుకురి వెంకటరాజు గుప్తా, కొత్త జగన్మోహన్, చెక్కా వీరబాబు, ఆత్మూరి రాము, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, కంచర్ల బద్రి, బి.నూకబాబు, బి.వీరసత్య, కంచర్ల బాబు, దారా శ్రీనివాస్, మానేపల్లి వీర్రాజు గుప్తా, మాతంశెట్టి సాయిబాబా పాల్గొన్నారు.

అదనపు టోల్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

సింగిల్ ఎంట్రీ విధానంతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులపై ప్రవేశపెట్టిన అదనపు టోల్ రుసుముల భారాన్ని రద్దు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు డిమాండ్ చేశారు. రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉన్న చోట టోల్ నిర్వహణ తగదన్నారు. రాష్ట్రంలో 69 టోల్ ప్లాజాలుండగా 65 చోట్ల ఇప్పటికే సింగిల్ ఎంట్రీ విధానం ప్రవేశ పెట్టారన్నారు. ఒక రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ వసూలు చేయడం వల్ల భారాలు పెరిగి నిత్యావసర ధరలపై ప్రభావం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే రూ.160గా వున్న టోల్ ఛార్జీని రూ.240కు పెంచారని, ఇప్పుడు ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు చెల్లించాల్సి రావడం తగదన్నారు. ఆర్ అండ్ బి రోడ్లపై టోల్ ప్రవేశపెట్టే ప్రజా వ్యతిరేక ప్రపంచ బ్యాంకు ఆలోచనలను కూడా విరమించుకోవాలన్నారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో బాక్సింగ్ మెన్ ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖపట్నం ప్రథమ స్థానంలో నిలవగా రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచింది. ఈ పోటీల్లో వై.ప్రవీణ్ (విశాఖ), సిహెచ్.జ్ఞానేశ్వరరావు (శ్రీకాకుళం), పి.అప్పలరాజు (శ్రీకాకుళం), జె.భానుప్రకాష్ (విశాఖ), ఎం.అంజనీ కుమార్(విశాఖ), ఎస్‌కె.రెహ్మాన్(విశాఖ), ఎస్.సాయితేజ (విశాఖ), వై.శ్రీధర్ (పశ్చిమ గోదావరి), ఎల్.సాయి వెంకట్ (పశ్చిమ గోదావరి), ఆర్.హేమంత్ కుమార్ (శ్రీకాకుళం) 10 మంది బాక్సర్లు స్వర్ణ పతకాలు సాధించారు. స్వర్ణ పతకాలు సాధించిన పదిమంది బాక్సర్స్ జనవరి 6 నుండి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి మెన్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొంటారని పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. మరో పది మంది క్రీడాకారులు వెండి పతకాలు, 20 మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ, డిస్టిక్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ద్రోణాచార్య అవార్డు డాక్టర్ ఐ వెంకటేశ్వరరావు, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ బి.ఎ.లక్ష్మణ్ దేవ్ బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాయుడు శ్రీనివాసరావు, అల్లవరపు నగేష్, కేతవరపు సత్య యేసు కృష్ణ, ఆర్‌బిహెచ్ఆర్ హైస్కూల్ వైస్ చైర్మన్ సూర్యవతి, బల్ల నవీన్, వంశీ, సాయి, అఖిల్, కె.చిన్నబ్బాయి, జె.ప్రసాదరావు, పవన్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కరెంటు బిల్లుల మంట

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సునీత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డి.సునీత అధ్యక్షతన జాతీయ వినియోగదారుల హక్కులపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులైన భద్రత హక్కు, అవగాహన హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, సమాచారం తెలుసుకునే హక్కు, పరిష్కరించుకునే హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ విధిగా బిల్లు తీసుకోవాలన్నారు. బిల్లుతో కూడిన క్రయవిక్రయాలు చేయడం ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధిలో పాత్ర పోషించినట్టు అవుతుందన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు ఆథరైజ్డ్ వ్యక్తుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, వినియోగదారులకి స్వచ్ఛమైన కల్తీ లేని వస్తువులు పొందే హక్కు ఉంటుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ప్రయాగమూర్తి మాట్లాడుతూ వాణిజ్య ప్రకటనల ద్వారా వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తే రూ.పది లక్షల జరిమానా, రెండేళ్ల జైలు, రెండోసారి నేరం రుజువైతే రూ.50 లక్షల జరిమానా, జైలు విధించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.రామారావు, డాక్టర్ కె.బంగార్రాజు, కె.సురేష్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ఎస్‌కె.మదీనా, శ్రీలక్ష్మి, సిహెచ్.పుష్ప, కుమారి మేరీ రోజలీనా విద్యార్థులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డి.సునీత



విద్యార్థుని అభినందిస్తున్న యాజమాన్యం

వాలీబాల్ జట్టుకు ఆదిత్య విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థి వరుణ్ సందేశ్ జెఎన్‌టియుకె వాలీబాల్ మెన్ టీముఉ ఎంపికైనట్టు సంబంధిత అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్టు ప్రిన్సిపల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. కేరళలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఈ టీములో విద్యార్థి ఎంపిక కావడం అభినందనీయమని డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. మంచి ప్రదర్శన కనబరిచి విజేతగా టీము నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్య సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి జట్టుకు ఎంపికైన వరుణ్ సందేశ్‌ను అభినందిస్తూ రూ.5000 నగదును అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్స్, విభాగాధిపతులు, ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

80 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అచ్చియ్యపాలెం గ్రామ శివారులో 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గంజాయి మత్తులో ఇద్దరిపై దాడి చేసిన ఇద్దరిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మద్దల సుబ్రహ్మణ్యం గంజాయి, మద్యం మత్తులో సైకిళ్ల పడగొట్టగా సూరంపేటకు చెందిన అక్కిరెడ్డి వీరబాబు ప్రశ్నించడంతో సుబ్రహ్మణ్యం ఒక్కసారిగా చిన్న కత్తితో అతడిపై దాడి చేశాడు. సుబ్రహ్మణ్యం స్నేహితుడు ఒరిగంటి మురారి వచ్చి బీర్ బాటిల్‌తో గాయపరిచాడు. దళిత పేటకు చెందిన గంధం నాగేశ్వరరావు వారిని నిలువరించడానికి వెళ్లగా ఆయనపై కూడా దాడి చేశారని పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

పురుగు మందు తాగిన రమణక్కపేటకు చెందిన విద్యార్థిని కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. చదువుపై శ్రద్ధ చూపాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని చింతపల్లి నైపుణ్య పురుగు మందు తాగింది. దీంతో వైద్యం నిమిత్తం హుటాహుటిన కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నరేంద్రపట్నంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. రాయభూపాలపట్నంలో నిర్వహించిన దాడుల్లో ఒక మహిళ నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసి చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరంలో ఒక బంగారం షాపులో ఓనర్‌పై దాడి చేసి చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ రహదారిలో ఉన్న శ్రీజీవన జ్యుయలర్స్ షాపులోకి యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన మామిడి రాజు, ఉద్దగిరి అఖిల్ వెళ్లారు. షాపు షట్టర్ మూసి షాపులో ఉన్న ఓనర్ భార్యను, అతని బంధువును సుత్తితో నెత్తి మీద తీవ్రంగా కొట్టి గాయపరిచారు. షాపులో కేజీన్నర బంగారు ఆభరణాలు చోరీ చేసి పారిపోతుండగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అఖిల్ అనే యువకుడు కొత్తపల్లి సచివాలయంలో సర్వేయర్ ఉద్యోగం చేసినట్టు చెప్పారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరిబాబు తెలిపారు

బైకుల చోరీపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బైకులు చోరీకి గురవ్వడంపై శుక్రవారం పోలీసులకు మూడు ఫిర్యాదులు వచ్చాయి. బొబ్బిలంక గ్రామానికి చెందిన గొంతు రాజు ఇంటి వద్ద పార్కింగ్ చేసిన హీరో హోండా బైకు, ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్ ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైకు, మిర్తిపాడు గ్రామానికి చెందిన పోతిరెడ్డి వినాయకరావు ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైకు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీల సీజ్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలం లోని లంక గ్రామాలైన కేదార్లంక ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టితో వెళుతున్న లారీలను పట్టుకొని శుక్రవారం అంగర పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.రవికుమార్ మాట్లాడుతూ ఇటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను విఆర్ఓ బుజ్జిబాబు, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. వీటిని మైన్స్ అధికారులకు స్వాధీనం చేసినట్లు ఎస్ ఐ రవికుమార్ తెలిపారు.



యానాంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల నిరసన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్‌ను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన, శాంతియుత ర్యాలీ చేపట్టారు. తొలుత స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేపట్టారు. అనంతరం ర్యాలీ చేపట్టి స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామికి వినతిపత్రం అందించారు. ఈ వినతిపత్రాన్ని కేంద్ర హోమ్ శాఖ కార్యాలయానికి చేరవేయాలని టవనెఅ కోరారు. ఈ కార్యక్రమంలో అర్థాని దినేష్, మల్లాడి సత్తిబాబు, లంక బంగారం, దున్నా చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ, మెల్లం చిన్న, మల్లాడి వీరాస్వామి, కెవివి.సత్యనారాయణ, శ్రీమంతుల శ్రీధర్, గణేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

జిల్లాలో పలుచోట్ల శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం భూ సంబంధమైన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశృల్దార్ కాంతారావు అన్నారు. మర్లావ గ్రామంలో సర్పంచ్ తోట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రజలు రెవెన్యూకు సంబంధించిన భూ సంబంధమైన సమస్యలు ఉంటే ఈ గ్రామ సభలో



సామర్లకోట సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్



పెద్దాపురం సదస్సులో ప్రసంగిస్తున్న డిటి కాంతారావు

దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో ప్రజల నుంచి 9 దరఖాస్తులు అందజేశారు. ఈ సమస్యలను పరిశీలించి సరి చేస్తామని డిటి.కాంతారావు అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సుబ్రహ్మణ్యం, గ్రామ సర్వేయర్ అరవింద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, కారెపు గాంధీ, యాళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాపవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై 8 అర్జీలను స్వీకరించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు యడ్ల శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లరేవు నీలపల్లిలో సర్పంచ్ చిట్టూరి నాగమణి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో భాగంగా నీలపల్లి, జార్జిపేట పంచాయతీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా సర్పంచులు చిట్టూరి నాగమణి, గుత్తుల సత్యవేణి పలు సమస్యలను లేవనెత్తారు. నీలపల్లి ప్రాంతంలో అయ్యన్ననగర్, కురసంపేట వంటి చోట్ల ఆక్రమణల వల్ల మురుగు కాలువలు మూసుకుపోయాయని తెలిపారు. పంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూములను సర్వే చేయించాలని, సర్పంచ్ నాగమణి కోరారు. ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో కాళీగా ఉన్న స్థలాలను పేదలకు అప్పగించాలని సర్పంచ్ నాగమణి కోరారు. జార్జిపేట పంచాయతీలో తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు మాట్లాడుతూ పంచాయతీ కోరిన మీదట మండల సర్వేయర్‌తో గ్రామ కంఠం భూములను సర్వే చేస్తామని, ఖాళీగా ఉన్న స్థలాలను పేదలకు ఇప్పిస్తామని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి



తాళ్లరేవులో సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి

టేకుమూడి ఈశ్వరరావు, జనసేన నాయకులు రాయుడు గోవింద మాట్లాడుతూ జార్జిపేట పరిధిలోని మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న స్థలం జిల్లా పరిషత్తుకు చెందినదని, కొందరు అన్యాక్రాంతంగా ఆ స్థలాన్ని వాడుకుంటున్నారని తెలిపారు. ఆ స్థలాన్ని సర్వే చేసి పంచాయతీకి అప్పగించాలని కోరారు. ఈ రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి తొమ్మిది దరఖాస్తు అందినట్లు డిటి సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి కలికి మూర్తి, గుత్తుల సూర్యనారాయణ, వస్కా రెడ్డి, దంగేటి సూరిబాబు, పిల్లి సత్తిబాబు, కాలా సత్తిబాబు, గంట గోపి పాల్గొన్నారు.

గొల్లప్రోలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు కెవివి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చెందుర్తిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై 3 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సౌమ్య, సర్వేయర్ కేదారేశ్వరరావు, విఆర్ఒలు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు పథకాలపై శిక్షణ

రౌతులపూడి : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు ఎంపిడిఒ శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలకు సంబంధించి 9 అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు.



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని బలరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ పైలా సీత, బలరాంపురం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ పుస్తకాలను గురువారం సర్పంచ్ సీత, ఎంపిటిసి సోమరౌతు రవి అందజేశారు. దాతలు అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మెరుగైన ఫలితాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ హరిబాబు, మాజీ సర్పంచ్ పైల పైడ్రాజు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కెవి రమణ, పైల రమేష్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

సైన్స్ సెంటర్‌ను సందర్శించిన రామచంద్రయ్య

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌ను శుక్రవారం ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ రామచంద్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ సెంటర్‌లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అతి సులభతరంగా ప్రయోగాలు చేయించడం ఆశ్చర్యపరిచిందన్నారు. ఇటువంటి సైన్స్ సెంటర్ జిల్లాకు ఒకటి ఉండాలన్నారు. ఇటువంటి సైన్స్ సెంటర్లు ఉండటంవల్ల భావి భారత మేధావులు తయారవుతారన్నారు. వీటివల్ల సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవనంలో ఇటువంటి సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం కోసం ఈ సైన్సు సెంటర్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రచార కన్వీనర్ శివ నాగేశ్వరరావు, తులసిరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

గొల్లప్రోలు : తాటిపర్తి నుంచి గొల్లప్రోలుకు వచ్చే తాగునీటి పాత పైపు లైన్‌ను మార్చి కొత్త పైపులైన్ వేయుచున్నందున శనివారం, ఆదివారం తాగు నీటి సరఫరాకు ఆటంకం కలగనుంది. కావున గొల్లప్రోలు పట్టణ ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించవల్సిందిగా మున్సిపల్ కమిషనర్ పి.రవికుమార్ తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ఏలేశ్వరం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఏలేశ్వరంలో సిపిఐ ఎంఎల్ (వినోద్ మిశ్రా) కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు కె.గణేష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవహేళనగా మాట్లాడిన మంత్రిని బర్తరఫ్ చేసి పార్టీ నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల పునరావాసం, శిక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత పాఠశాలలో శుక్రవారం బహుళ వైకల్యం, బధిర, అంధత్వం బాలలకు, వారి తల్లిదండ్రులకు ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ కాకినాడ వారు అజయ్ ఫౌండేషన్ సాయంతో నెట్ వర్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల హెచ్ఎం ఎంఎల్.శివజ్యోతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వికలాంగ బాలల కోసం, వారి భవిష్యత్తు కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్ఎ.నాయుడు తల్లిదండ్రులనుద్దేశించి ప్రసంగించారు. పిల్లల సంరక్షణ, పునరావాస కార్యక్రమాలు, వాటి ఫలితాలు వంటి అంశాలను వివరించారు. ఈ సహాయ సహకారాలను ఉపయోగించుకుని తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు సహకరించాలన్నారు. భవిత సిబ్బంది బి.దుర్గా ప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్టు ఎస్.సంపత్, జి సుశీల, ఎన్.మురళీకృష్ణ, వి.స్వాతి, పి.గోవిందరాజు ప్రసంగించారు.

కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం...

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కష్టించి పని చేసిన కార్యకర్తలను టిడిపి అన్ని విధాలుగా ఆదుకుంటుందని టిడిపి అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ తెలిపారు. శుక్రవారం ఉప్పాడ తీరప్రాంతంలో ఆయన పర్యటించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురు మత్స్యకారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను పంపిణీ చేశారు. సూరాడ శ్రీనుకు రూ.2 లక్షల 1500, బాదిన బాబూరావుకు రూ.లక్షా 60 వేలు, బడే మనోజ్‌కు రూ.27,600 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు కష్టం ఎదురైనపుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దకొడుకుగా ఆదుకుంటారని హామీ ఇచ్చారని, అందుకే ఆసుపత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేశారని తెలిపారు. గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురు మత్స్యకారులను పరామర్శించి, వైద్యుల ఖర్చు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానందరెడ్డి , మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి నుంచి చెక్కులు అందిస్తున్న వర్మ

సత్యదేవుని జన్మ నక్షత్ర వేడుకలు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవునికి జన్మ నక్షత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జన్మ నక్షత్రం మఖ సందర్భంగా శుక్రవారం వేకువ జామున ప్రధాన ఆలయంలో అర్చకులు స్వామివారికి అభిషేకాలు వంటి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి హోమంతో ఈ వేడుకలు ముగిశాయి. ఇఒ వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

1,900 గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్లు సక్రమం

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల జాబితాలో సామర్లకోట పట్టణం నుండి 1900 మంది ఓటర్ల నమోదు సక్రమంగా జరిగినట్లు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి చెప్పారు. కూటమి తరపున సామర్లకోట పట్టణంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఎంఎల్‌సి ఓటర్ల నమోదులో ఓటరు జాబితా ముసాయిదాను పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి, గౌడ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తన కార్యాలయం నుంచి ఈ జాబితాను పంపించినట్టు అధ్యక్ష కార్యదర్శులు కుమారస్వామి, శ్రీకాంత్ తెలిపారు. సామర్లకోట పట్టణం నుంచి 2 వేలు దరఖాస్తు చేయగా వాటిలో 1900 దరఖాస్తులు సజావుగా ఉన్నట్టు తెలిపారు. ముసాయిదాలో తప్పులుంటే సరి చేసుకునేందుకు వీలుగా స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని కార్యదర్శి బడుగు శ్రీకాంత్ కార్యాలయంలో జాబితాలు అందుబాటులో ఉన్నందున ఓటర్లంతా వారి వివరాలు సరి చూసుకోవాలని ఈ సందర్భంగా వారి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పెదపూడి

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యుల ఒకరోజు శిక్షణా తరగుతులకు ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఏ విధంగా ప్రణాళికలు తయారు చేయాలో ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఐదు గ్రామ పంచాయతీలకు మంజూరైన ఐదు ట్రాక్టర్లను ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులకు ఎంఎల్ఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.నరేంద్రరెడ్డి, ఇఒపిఆర్‌డి ఎం.సత్యనారాయణరెడ్డి, ఎన్‌డిఎ నాయకులు పిఎసిఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు జుత్తుగ కృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి వీరాస్వామి, గంటా రాజు, కొటికలపూడి సత్తిబాబు, గంద్రేడు సానా శ్రీను పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇస్తున్న శిక్షణను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని సామర్లకోట ఎంపిడిఒ కాదా హిమ మహేశ్వరి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు తదితర ప్రజాప్రతినిధులకు 9 అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్షేత్రస్థాయి నుంచి సమగ్ర అభివద్ధి సాధించడం లక్ష్యంగా ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. పలు అంశాలపై ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ సతీష్, సర్పంచులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణా తరగతులు


ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామపంచాయతీ పరిధిలో డెవలప్మెంట్ ప్లాన్‌పై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఒ శ్రీలలిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విడుదలయ్యే నిధులతో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, భార్గవ, సుభానీ, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సుస్థిరత దిశగా ప్రజాప్రతినిధులు పయనించాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

ప్రస్తుతం ఉన్న వనరులు ఉపయోగించుకుంటూ భవిష్యత్ తరాలకు వాటిని అందించే సుస్థిరత దిశగా ప్రజా ప్రతినిధులు అందరూ కృషి చేయాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25పై ఆయా సర్పంచులు, ఎంపిటిసిలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపిపి సునీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొమ్మిది రకాల అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి చేయవలసిన ప్రణాళికలను ఎంపిడిఒ ఎ.సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ఆర్‌టిసి మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆర్‌టిసి డోర్ డెలివరీ మాసోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 80 పట్టణాల్లో ఉన్న కార్గో సెంటర్స్ ద్వారా 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ చేసేందుకు ఆర్‌టిసి అన్ని ఏర్పాట్లూ చేసిందని చెప్పారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని త్వరితగతిన అతి చౌకైన ధరలతో ఉన్న కార్గో సర్వీసులను ఉపయోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపిటిఒ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం బాషా, కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, పిఆర్ఒ సిహెచ్.వెంకట్రాజు సిబ్బంది పాల్గొన్నారు.